# కాంగ్రెస్ నేతలపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి






**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ఏఐసీసీ, టీపీసీసీ ఆహ్వానంపై స్పందించిన కాంగ్రెస్ నాయకులు నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై దాఖలైన చార్జ్‌షీటుకు నిరసనగా మంచిర్యాలలో ధర్నా నిర్వహించారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు కార్పొరేషన్ పరిధిలోని ఐటీ ఆఫీస్ వద్ద జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు పాల్గొన్న ధర్నాలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఈడీని అస్త్రంగా మలుచుకుని కాంగ్రెస్ అగ్ర నేతలపై రాజకీయ కక్ష సాధింపుతో చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ ధర్నాలో కాంగ్రెస్‌కి చెందిన మాజీ ప్రజా ప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**చెన్నూర్ లో..**

శెనార్తి మీడియా, మంచిర్యాల : నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ అక్రమంగా కేసులు నమోదు చేయడాన్ని చెన్నూర్ కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబాడ్జీలు ధరించి వారు నిరసన తెలిపారు. గాంధీ కుటుంబం చరిష్మా కోల్పోయిందని కేంద్రం భావించి తప్పుడు కేసులు వేస్తోందని విమర్శించారు. ఈ కేసులో ఆధారాలు లేవని పలు కోర్టులు స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ జోడో యాత్రకు ప్రజల్లో లభించిన స్పందనను భరించలేకే కేంద్రం ఇలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రతిపక్షాలపై అసత్య ప్రచారాలు చేసే కేంద్రంపై ప్రజల్లో అసహనం పెరుగుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని తన నివాసం వద్ద, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 253 మంది లబ్ధిదారులకు రూ.2,54,04,435 విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 345 మందికి రూ.1,17,22,500 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ బియ్యం సరఫరా
# ప్రచారం అవాస్తవం

- జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రజా పంపిణీ వ్యవస్థలో చౌక ధరల దుకాణాల ద్వారా ప్లాస్టిక్ బియ్యం సరఫరాపై జరుగుతున్న ప్రచారం అవాస్తవమని, అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావాత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాలలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని తెలిపారు. ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్న బియ్యం అందిస్తున్న నేపథ్యంలో ప్రజలను ఆందోళనకు గురిచేసి సమాజంలో అశాంతి పరిస్థితిని సృష్టించేందుకు కొంత మంది సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని-తిలక్ నగర్ లో పంపిణీ చేస్తున్న సన్నబియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కలిసాయని సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, ఎక్స్ లలో వీడియోలు ప్రచారం చేశారని, ఈ విషయంపై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి స్పందించి తిలక్ నగర్ లో ఎటువంటి ప్లాస్టిక్ బియ్యం సరఫరా జరగలేదని, అసత్య ప్రచారం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలను భయాందోళనలకు గురి చేసే అసత్య ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## కాంగ్రెస్ నాయకుల నిరసన

**శెనార్తి మీడియా, రామకృష్ణాపూర్(మంచిర్యాల):**

పట్టణం లోని ఆర్కేపి సీహెచ్‌పీ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఏఐసీసీ ఆదేశానుసారం,టీపీసీసీ పిలుపు మేరకు బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం ప్రదర్శించినట్లు మంచిర్యాల జిల్లా అధికార ప్రతినిధి వోడ్నాల శ్రీనివాస్ తెలిపారు.బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ అగ్రనేతలైన సోనియా గాంధీ,రాహుల్ గాంధీల పేర్లను నేషనల్ హెరాల్డ్, మనీ లాండరింగ్ కేసుల్లో ఈడీ ఛార్జిషీటులో చేర్చడం కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాఘనాథ్ రెడ్డి,గాండ్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# కమిషనరేట్‌లో మెగా హెల్త్ క్యాంప్

- ఆరోగ్య సమస్యల పట్ల శ్రద్ధ వహించాలి
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**శెనార్తి మీడియా, మంచిర్యాల/గోదావరిఖని:**

రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పోలీసు సిబ్బంది, హోంగార్డులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత ఉద్యోగుల కోసం మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు నిరం తరం ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని సూచించారు. ఫిజిషియన్, కార్డియాలజీ, న్యూరాలజీ, ఆర్థో, గైనకాలజీ, కంటి, దంత చికిత్సలతో పాటు సీపీఆర్ ప్రాథమిక చికిత్సపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కమిషనర్ స్వయంగా కంటి పరీక్షలు చేయించుకోవడం ఆకర్షణీయంగా నిలిచింది. సిబ్బంది పరీక్షలతో సరిపెట్టుకోకుండా డాక్టర్ల సలహాలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ శిబిరంలో రేని హాస్పిటల్ కరీంనగర్, కేర్ హాస్పిటల్ హైదరాబాద్, శ్రీకాంత్ డెంటల్ గోదావ రిఖని, మాక్స్ విజన్




వరంగల్, మంచిర్యాల ప్రభుత్వ హాస్పిటల్ నుంచి వైద్యులు పాల్గొన్నారు. శిబిరంలో సీపీఆర్ పాఠాలు కూడా వినిపించగా, కమిషనర్ స్వయంగా సీపీఆర్ డెమో చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు రాజు, రాఘవేంద్ర రావు, ఏసీపీలు రమేష్, నరసింహులు, మల్లారెడ్డి, ప్రతాప్, ఇతర అధికారులు, డాక్టర్లు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. శిబిరం విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాలకు కమిషనర్ అభినందనలు తెలిపారు.




# చలో వరంగల్ పోస్టర్ పరేడ్



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మాజీ ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఆదేశాల మేరకు ఈనెల 27న జరగనున్న ఛలో వరంగల్ సభను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం సాయంత్రం మందమర్రి పట్టణ పాత బస్టాండ్ ఏరియాలో వాల్ పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ రాజా రమేష్, మందమర్రి పట్టణ మహిళా కార్యకర్తలు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఆర్మీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి




**శెనార్తి మీడియా, గోదావరిఖని :**

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో విజయాన్ని సాధించేందుకు ఉచితంగా అందిస్తున్న శిక్షణను అభ్యర్థులు పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ సూచించారు. గోదావరిఖని సఈఅర్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను ఏసీపీ రమేష్, ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. అగ్నివీర్ ద్వారా ఆర్మీ విభాగాల్లో నియామకానికి జిల్లాలో ఆసక్తి గల అభ్యర్థులకు రాత పరీక్షతో పాటు ఫిజికల్ శిక్షణ కూడా ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. రిటైర్డ్ ఆర్మీ జవాన్ల పర్యవేక్షణలో స్టేడియంలో రన్నింగ్, మెడికల్ తదితర శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. అభ్యర్థులు కష్టపడి ఉద్యోగాలు సాధించి దేశ భద్రత, ప్రజల రక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి, ఇంచార్జి మహిపాల్ రెడ్డి, టీచింగ్ ఫాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.



# నకిలీ పత్తి విత్తనాలపై అవగాహన

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా భీమారం మండలంలోని మద్ది కల్ గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలపై వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు హెచ్చరికలు జారీ చేస్తూ హెచ్టి కాటన్ సీడ్ సాగు చేయవద్దని సూచించారు. విత్తనాలను లైసెన్సుదారులైన డీలర్ల వద్ద నుంచే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన రసీదును పంటకాలం పూర్తయ్యేవరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మే దళారుల వివరాలను అధికారులకు తెలియజేయాలని, అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.






# బీఆర్ఎస్ 'చలో వరంగల్' వాల్ రైటింగ్

**శెనార్తి మీడియా, రామకృష్ణాపూర్(మంచిర్యాల):**

ఈ నెల 27న చలో వరంగల్ ఎల్కాతుర్తిలో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సంబంధించిన వాల్ రైటింగ్‌ను బుధవారం చెన్నూర్ నియోజకవర్గ ఇంచార్జ్ డా.రాజరమేష్ రామకృష్ణాపూర్ పట్టణంలో ప్రారంభించారు.పట్టణంలోని పలు వార్డులల్లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి వాల్ రైటింగ్,వాల్ పోస్టర్లను అతికించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కంభగోని సుదర్శన్ గౌడ్,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రామిడి కుమార్,బడికల సంపత్,ఆలుగుల సత్తయ్య, పోగుల మల్లయ్య, బోయినపల్లి అనిల్ రావు,రేవెల్లి ఓదెలు, జీలకర్ర మహేష్,గడ్డం రాజు,యువ నాయకులు రామిడి లక్ష్మీకాంత్,ఆశనవేణి సత్యనారాయణ,చంద్ర కిరణ్, కుర్మ దినేష్,దేవి సాయి కృష్ణ,శివ,మణి,నూనె రాజేందర్ పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ఇద్దరి రిమాండ్

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:** గంజాయి కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ సీఐ భీమేశ్, ఎస్సై శ్రీకాంత్‌లు తెలిపారు. వారి కథనం ప్రకారం.. మంగళవారం సాయంత్రం పక్కా సమాచారం మేరకు కుంటాల ఎక్స్‌రోడ్‌లో నేరడిగొండకు చెందిన బత్తుల కిరణ్ అనే వ్యక్తిని తనిఖీ చేయగా 160 గ్రాముల గంజాయి లభించినట్లు పేర్కొన్నారు. దంసతండా గ్రామానికి చెందిన పెందూర్ లచ్చు నుంచి గంజాయి తీసుకొచ్చినట్లు తెలిపాడు. కాగా లచ్చును విచారించగా తన వ్యవసాయ భూమిలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు తెలిపాడు. అతని నుంచి 290 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు. స్వాధీనం చేసుకున్న మొత్తం 450 గ్రాముల గంజాయి విలువ రూ.11,250 ఉంటుందన్నారు.